క్లుప్తంగా

కొత్త వ్యక్తులపై అప్రమత్తత అవసరం



వాహనాల తనిఖీ చేపడుతున్న అధికారులు

సోంపేట: తీరప్రాంత గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వారిపై అప్రమత్తత అవసరమని బారువ మెరైన్ సీఐ జె.రమేష్ అన్నారు. బారువ మెరైన్‌స్టేషన్ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో డిఫెన్స్ మాక్ డ్రిల్ బుధ, గురువారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు తీరప్రాంత భద్రత పై అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు నిర్వహించారు. బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీ తిరుమలరావు

కోటబొమ్మాళి: వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ బీవీ తిరుమలరావు అన్నారు. మండలంలోని ఎత్తురాళ్లపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పొలంబడిలో చెప్పిన విషయాలపై రైతులు అవగాహన కల్పించుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ

కవిటి: విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన విశ్రాంత జియోలాజికల్ ఇంజినీర్ జుత్తు సింహాచలం ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమైనవని హెచ్‌ఎం సనపల రామకృష్ణ అన్నారు. గురువారం ఈ మేరకు జుత్తు జగన్న చారిటుబల్ ట్రస్ట్ పేరిట జిల్లాలోని 20 మండలాల్లోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలకు చెందిన పదో తరగతి బాలబాలికలకు రూ.7,00,000 విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందించినట్టు రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బొరివంక ఉన్నత పాఠశాల సిబ్బందికి మెటీరియల్‌ను పంపిణీ చేయడంపై గెస్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు

టెక్కలి: పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. మార్నింగ్ వాక్ ఫర్ పూర్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా పతంగి సూర్యారావు, షేక్ ఇమామ్, పూతిక రాజేశ్వరి తదితరులకు 25 కిలోల బియ్యం, 20 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, సభ్యులు ఎల్.కామేశ్వరరావు, శ్రీనివాస్ బెహరా, ఎన్.సింహాచలం, డి.పూర్ణాచారి, ఎ.వీరభద్రం, మున్నా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి

టెక్కలి: వివిధ కేసుల్లో చిక్కుకున్న కక్షిదారులు విముక్తి కోసం జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి సూచించారు. కోర్టు సముదాయంలో న్యాయవాదులతో సమావేశం గురువారం నిర్వహించారు. డిసెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న అదాలత్‌లో అధికంగా కేసులు రాజీ జరిగే విధంగా చూడాలన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

ఆంధ్రా–ఒడిశాలను కలిపే పది కిలోమీటర్లు పొడవు ఉన్న రోడ్డులో గొప్పిలి వద్ద కల్వర్టు పలకలు పగిలిపోయాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల రోడ్డు గుంతలు పూడ్చడం పూర్తి చేసినప్పటికీ, చిన్నపాటి కల్వర్టు మరమ్మతులు చేయకుండా విడిచిపెట్టడంతో ద్విచక్ర వాహనదారులు, సైకిల్ తొక్కేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. అందువలన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. – కాశీబుగ్గ

99 రకాల వంటలతో నైవేద్యం

భగవాన్ సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా గురువారం టెక్కలి రోటరీనగర్ శాంతి సుధా మందిరంలో 99 రకాల పిండి వంటలతో బాబాకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. – టెక్కలి





మందుబాబుల అడ్డా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మందుబాబుల జోరు ఎక్కువైపోయిందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో మందుబాబులు బహిరంగ ప్రదేశాలు, ప్రయాణికుల విశ్రాంతి భవనాలను ఆవాసాలుగా చేసుకుంటున్నారు. అక్కడే మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, తిను బండారాలను వదిలివేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కేశుపురం–తిప్పనపుట్టుగ జంక్షన్ బస్టాండ్‌లో మద్యం సేవిస్తున్న మందుబాబుల దృశ్యమిది. – ఇచ్ఛాపురం రూరల్

అధ్వానం

కంచిలి మండలంలోని నారాయణబట్టి గ్రామం వద్ద అంపురం–ఘాటీముకుందాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో గత నెలలో కల్వర్టు కూలిన విషయం తెలిసిందే. దానికి ట్రాక్టర్ యూనియన్ సాయంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అయితే ప్రస్తుతం ఆ భాగంలో గోతులు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. – కంచిలి



నవీకరణ దిశగా..!



ఇచ్ఛాపురం పీఏసీఎస్ కార్యాలయం, డీసీసీబీ బ్యాంకులు

- సహకార సంఘాల రికార్డుల కంప్యూటరీకరణ
- పారదర్శకతకు పెద్దపీట వేసేలా చర్యలు
- ఇకపై రాయితీలన్నీ నేరుగా రైతు ఖాతాలోకే

ఇచ్ఛాపురం రూరల్:

ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంలో సహకార సంఘాల పాత్ర కీలకం. వాటిని మరింత బలోపేతం చేసి ప్రజలకు సేవలు సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు చలామణి అవుతున్న సేవలను నవీకరణ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా కార్యాచరణ ప్రారంభించింది. తద్వారా సహకార సంఘాల్లో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు వంటి తప్పులకు ఇక చెక్ పడనుంది. నేషనలైజ్డ్ బ్యాంకుల తరహా రుణాల వివరాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతోంది.



కంప్యూటరీకరణ చేస్తున్న ఉద్యోగులు

ఉపయోగాలు ఎన్నో

పీఏసీఎస్‌లను నాబార్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేలా కేంద్ర సహకార మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. దీంతో సొసైటీలో నమోదైన ప్రతీ ఖాతాదారుడికి కంప్యూటరైజ్డ్ పాస్‌బుక్ వస్తుంది. అందులో తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, పడుతున్న వడ్డీ తదితర వివరాలు పక్కాగా ఉంటాయి. భూముల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలన్నీ నేరుగా రైతు ఖాతాలకే జమకానున్నాయి.

ఇచ్ఛాపురం పరిధిలో...

ఇచ్ఛాపురం పరిధిలో ఆరు ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్)లు ఉన్నాయి. వీటి పరిధిలో ఇచ్ఛాపురం సొసైటీ పరిధిలో 3,214 మంది రైతులు, కవిటి సొసైటీ పరిధిలో 2,494 మంది రైతులు, కంచిలి సొసైటీ పరిధిలో 4,921 మంది రైతులు, సోంపేట సొసైటీ పరిధిలో 2,611 మంది రైతులు, మందస సొసైటీ పరిధిలో 1,856 మంది రైతులు, బాలిగాం సొసైటీ పరిధిలో 3,154 మంది రైతులు లావాదేవీలు చేస్తున్నారు.

సేవలు విస్తృతం



ప్రాథమిక సహకార సంఘాల్లోని సేవలను మరింత విస్తృతం చేసేందుకే నవీకరణ దిశగా శ్రీకారం చుట్టడం జరిగింది. అక్రమాలకు తావులేకుండా పారదర్శక సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రక్రియ అమల్లోకి తెచ్చేలా యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. ఉద్యోగులంతా దీనిపై కసరత్తు చేస్తున్నారు. దాదాపుగా 75 శాతం డేటా ఎంట్రీ పూర్తయింది. ఈ నెలాఖరులోపు శతశాతం పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాం.
– ఎల్.పాపారావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఇచ్ఛాపురం

కిడ్నీ రోగులకు కూటమి అందిస్తున్న సేవలేంటి

- మండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రశ్న



మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానంలో మృత్యువాత పడుతున్న కిడ్నీ రోగులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవలేమిటో చెప్పాలని మండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం ప్రశ్నించారు. ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధులపై అప్పట్లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడిగా స్పందించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. కవిటి మండలం జగతి గ్రామంలో నేరుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి అధికారంలోకి వస్తే డయాలసిస్ చేయించుకుంటున్నవారికి రూ.10 వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చినమాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ రూ.10 వేలు అందజేసినట్లు తెలియజేశారు. తాగునీటి వలన కిడ్నీవ్యాధులు వస్తున్నాయని వైద్య పరిశీలన నిపుణులు, బృందాలు చెబితే, ఏడు మండలాల్లో ఉన్న ఉద్దానం ప్రజలకు రూ.700 కోట్ల వ్యయంతో హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు శుద్ధజల తాగునీరు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. అంతేకాకుండా ఉద్దానం ప్రాంతం పలాసలో రూ.74 కోట్లతో 200 బెడ్లతో కిడ్నీ రీసెర్చ్ కేంద్రాన్ని నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒక్కో డయాలసిస్ కేంద్రంలో ఒకే బెడ్ మీద ముగ్గురు రోగులకు డయాలసిస్ చేయిస్తున్నారని, డయాలసిస్ యూనిట్లు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



క్రీడలను ప్రారంభిస్తున్న మధుకేశ్వరరావు

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ క్రీడాకారులకు గ్రామీణ క్రీడలు వేదికలుగా నిలుస్తాయని, ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అకాంక్షించారు. కాగా ఈ పోటీల్లో అండర్–17 విభాగం కబడ్డీ (బాలురు)లో అక్కుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, జెడ్పీహెచ్ స్కూల్ బెండి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్–14 విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నగరంపల్లి ప్రథమ స్థానంలో, సాయి వినీత్‌స్కూల్ పూండి ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే అండర్–17 విభాగం ఖో–ఖో (బాలికలు) జెడ్పీహెచ్ స్కూల్ నగరంపల్లి ప్రథమ స్థానంలో, హుకుంపేట పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్–14 విభాగంలో నగరంపల్లి జెడ్పీహెచ్ స్కూల్ ప్రథమ స్థానంలో, జెడ్పీహెచ్ స్కూల్ పాతటెక్కలి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పీడీ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం, బమ్మిడి అనందరావు తదితరులు పాల్గొన్నారు.

'సిక్కోలు కళా జాతరకు సహకరించండి'



విరాళం అందజేస్తున్న ఢిల్లీరావు

కాశీబుగ్గ: ప్రతిఏటా సంక్రాంతికి నిర్వహించే సిక్కోలు జానపద కళా జాతరకు అందరూ సహకరించాలని సిక్కోలు జానపద కళాజాత అధ్యక్షుడు రాపాక ధనరాజు కోరారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామం చింతలపోలమ్మ ఆలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల కళలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, పేద కళాకారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీఏటా నిర్వహించే కార్యక్రమం 2025 జనవరి 12వ తేదీన వజ్రపుకొత్తూరు మండలం రాజాంలో నిర్వహిస్తామని తెలియజేశారు. దీనికోసం తొలి విరాళం బొడ్డపాడుకు చెందిన కిక్కర ఢిల్లీరావు రూ.5,555లు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ కోశాధికారి మామిడి కృష్ణారావు, ఉపాధ్యక్షుడు దున్న రామారావు, ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్‌కుమార్, మడియా వాసు, సార జోగారావు, గర్త తులసీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కాశీబుగ్గ: మందస మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఈఆర్వో కార్యాలయం ఈఈ జి.యగ్నేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపులో భాగంగా భోగాబంధ, చిన్నబరంపురం, కిల్లోయి, సందూరు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, పరిసర ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

అసిరిపోలమ్మ సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్



పూజలు నిర్వహిస్తున్న పిరియా విజయ

కవిటి: మండలంలోని బి.గొనపపుట్టుగ పంచాయతీ తుంగానపుట్టుగ గ్రామదేవత అసిరిపోలమ్మ సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ ఉత్సవాల మూడోరోజు దర్శించుకున్నారు. వేడుకల్లో సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంపీటీసీలు పిరియా కృష్ణారావు, దుద్ది సతీష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం రూరల్: వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం హరిపురం పంచాయతీలో స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారం దొంగతనం చేస్తున్న నేపథ్యంలో అజాగ్రత్తగా ఉండరాదని, ఊళ్లకు వెళ్లే సమయంలో తలుపులకు తాళాలు వేసి పక్కంటివారిని అప్రమత్తం చేయాలన్నారు. మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే అపరాధ రుసుం వసూలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి చల్లా కృష్ణారెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరులో సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఎన్.రామారావుకు వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. జంట పట్టణాల్లో అత్యధికంగా ప్రజలు సేదతీరడానికి వస్తున్న ఈ పార్కులో సమస్యలు పరిష్కరించి, సౌకర్యాలు పెంచాలన్నారు. ఇక్కడ విద్యుత్ బల్బులు లేవని, ఫెన్సింగ్ సౌకర్యం లేదని తక్షణమే సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జి.రాజేంద్రనాయుడు, కార్యవర్గ సభ్యుడు దడియాల నరసింహులు, లండ నాగరాజు, బి.శంకరరావు, ఎస్.వసంతు, సంతోష్ పాత్రో, బోనెల భైరాగి, సత్యనారాయణ, వెంగళ సూర్య తదితరులు పాల్గొన్నారు.

కరాపాడు టోల్‌గేట్‌పై ఫిర్యాదు

కంచిలి: నిబంధనలకు విరుద్ధంగా కవిటి మండలం కరాపాడు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌పై బరంపురంలో ఉన్నటువంటి జాతీయ రహదారుల సంస్థ రీజనల్ కార్యాలయ ప్రాజెక్టు డైరెక్టర్ దర్శి ప్రకాశ్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ యూనియన్ జిల్లా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. వీరు గురువారం బరంపురం వెళ్లి ఎన్‌హెచ్–16 పీడీని కలిసినట్లు తెలిపారు. కరాపాడు టోల్‌గేట్ పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ నుంచి కేవలం 47 కిలోమీటర్ల దూరంలో ఉందని, వాస్తవానికి టోల్‌గేట్ల మధ్య 60 కిలోమీటర్లు దూరం ఉండాలనేది నిబంధన ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా కరాపాడు టోల్‌గేట్‌కు 20 కిలోమీటర్లు పరిధిలో ఉన్న వాహనాలకు వాహనదారుల ఆధార్‌కార్డులను పరిగణనలోకి తీసుకొని లోకల్ పాస్‌లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, అలా ఇవ్వకుండా టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందువలన నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కరాపాడు టోల్‌గేట్‌ను తొలగించాలని విన్నవించారు. పీడీని కలిసినవారిలో ఏపీ స్టేట్ బీసీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ బీన ఢిల్లీరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫ్రంట్ లీగల్ అడ్వైజర్ చౌదరి లక్ష్మణరావు, ట్యాక్సీ యూనియన్ ప్రతినిధులు పల్లి హరిశ్చంద్ర, అమీరుల్లా, దుర్గా, పింటు, వేణు, శంకర్ తదితరులున్నారు.

బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి

కంచిలి: రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు సత్వరమే సమర్పించాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రైస్ మిల్లర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గ్యారెంటీలు సకాలంలో అందజేస్తేనే రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు మిల్లర్లు సహకరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ, రైస్ మిల్లు యజమాని పైల దేవదాస్‌రెడ్డి, మండల మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మల్లా ధనుంజయరావు, సీఎస్‌డీటీ కూర్మారావు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్ : అణగారిన వర్గాల ప్రజలు, రైతుల పక్షాన నిలుస్తూ వారి సమస్యలపై అనేక పోరాటాలు చేసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మర్రిపాడులో బుధవారం అమరవీరుల 46వ స్మారక సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరవీరులను స్మరిస్తూ నివాళులర్పించారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ పాలనతో దేశానికి ఫాసిస్ట్ ప్రమాదం పొంచి ఉందని, దేశంలో మతోన్మాదాన్ని విద్వేషాలను రెచ్చగొట్టడం సంఘ పరివార్ అజెండా అని విమర్శించారు. దీనిలో భాగంగానే దక్షిణాదిలో పవిత్రమైన తిరుపతి లడ్డూ విషయంలో పవన్ కల్యాణ్‌ని అడ్డం పెట్టుకొని మత విద్వేషాలతో రాజకీయం చేసే యత్నం చేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరస్వామి, మామిడి భీమారావు, మద్దిల వినోద్, బతకల ఈశ్వరమ్మ, సౌర్ర రామారావు, మురిపింటి తాతారావు, రాపాక చంద్రయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

కలెక్టర్ సమీక్ష నేడు

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ కేంద్రం పరిధిలో పనిచేస్తున్నటువంటి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పలాస ఆర్డీవో వేంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పట్టణంలోని పాత జాతీయ రహదారికి పక్కనున్న టీకేఆర్ కల్యాణ మండపంలో సమీక్ష జరుగుతుందని, అధికారులు హాజరవ్వాలని సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ: ప్రతీ శుక్రవారం కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహించే ఎస్పీ గ్రీవెన్స్‌ను శుక్రవారం రద్దు చేసినట్లు కాశీబుగ్గ పోలీసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

బోరుభద్రలో కంటి వైద్య శిబిరం

సంతబొమ్మాళి: మండంలోని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ 60 మందిని పరీక్షించి, 12 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరికి రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.పద్మావతి, ఆరోగ్య పర్యవేక్షకురాలు డి.కమలమ్మ పాల్గొన్నారు.

ఆడిట్ చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రతీ స్వయం శక్తి సంఘాన్ని ఆడిట్ చేయాల్సిన బాధ్యత వీవోఏలపై ఉందని వెలుగు ఇన్‌చార్జి ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షురాలు ఎల్.సుశీల, సీసీలు మోహనరావు, లక్ష్మీ పాల్గొన్నారు.

షట్టర్ల తొలగింపు

పలాస: కాశీబుగ్గ మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్సు రెండో ఫ్లోర్‌లో ఒక షాపు షట్టర్ పడిపోయే పరిస్థితుల్లో ఉండడంతో పక్క దుకాణదారులు భయం గుప్పిట్లో కార్యక్రమాలు నిర్వహించేవారు. దీంతో ఈ విషయంపై సాక్షి పత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పందించారు. వెంటనే పడిపోవడానికి సిద్ధంగా ఉన్నటువంటి షట్టరును గురువారం తొలగించారు. దీంతో దుకాణదారులు హర్షం వ్యక్తం చేశారు.

సాగరమిత్ర భవనం ప్రారంభోత్సవం

వజ్రపుకొత్తూరు: మండలంలోని మత్స్యకార గ్రామం కంబాలరాయుడుపేటలో సాగరమిత్ర సామాజిక భవనాన్ని సర్పంచ్ వంక చిరంజీవిరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోటుల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం వేట నిషేద భృతి తక్షణమే అందించాలని కోరారు. సాగర మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మూగి జంగమయ్య, మాజీ సర్పంచ్ కంబాల దానేసు, ఎంపీటీసీ సభ్యుడు కారి వెంకటరావు, మత్స్యశాఖ ఎఫ్‌ఎం కె.నాగరాజు, సాగర మిత్ర అంబటి జానకిరామ్ పాల్గొన్నారు.

వంట గ్యాస్ పొదుపు అవసరం

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు వంటగ్యాస్ వినియోగంపై విద్యావంతులైన బాలబాలికలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు సూచించారు. కవిటి భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వంటగ్యాస్ పొదుపు వినియోగంపై అవగాహన కల్పించేందుకు బాలబాలికలకు ఓపెన్ క్విజ్ గురువారం నిర్వహించారు. విజేతలకు సంస్థ అధినేత కె.వెంకట్రావు బహుమతులు అందజేశారు.

గుండె వ్యాధుల వైద్య శిబిరం నేడు

కాశీబుగ్గ: మందస మండలం పొత్తంగి–సిరిపురం జంట గ్రామాల్లో గుండె వ్యాధుల వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించనున్నట్లు గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు, జెమ్స్ ఆస్పత్రి ఏరియా కో–ఆర్డినేటర్ రాపాక తిరుపతిరావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని, సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.